



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

25 నుంచి 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఈ నెల 25 నుంచి జనవరి 26 వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో యాత్ర విజయవంతానికి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాలులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహణ పై జిల్లా ప్రత్యేక పర్యవేక్షకులు కేంద్ర ప్రభుత్వ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రెటరీ కిరణ్ కుమార్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర 484 గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందచేస్తున్న సహాయం, సంక్షేమ పథకాల గురించి ప్రజలలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్ గా, 36 శాఖల జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామస్థాయిలో సర్పంచి అధ్యక్షుడుగా 10,12 మంది అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రచార నిమిత్తం జిల్లాకు 4 వ్యాన్లు రానున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందిస్తున్న వివిధ పథకాల గురించి ప్రజలకు తెలియజేసే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాలు జరగాలన్నారు.విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి మాట్లాడుతూ వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా 36 శాఖలకు సంబంధించిన సంక్షేమ పథకాలను ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లాకు ప్రచార నిమిత్తం నాలుగు వ్యాన్లు వస్తున్నాయని, మొదట 25న గోనెగండ్ల, 26 న గూడూరు, 27న ఓర్వకల్లు, 28న కల్లూరు మండలాలలో కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. పథకం ఉద్దేశ్యం నెరవేరేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

28న జిల్లాకు సిఎం రాక

ఈనెల 28న జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాణ్యం నియోజకవర్గ పరిధిలోని ఓర్వకల్లు మండలంలో జగనన్న విద్యా దీవెన ఆర్థిక సాయం నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ కు సీఎం కార్యాలయం అధికారులు సమాచారాన్ని అందజేశారు. సిఎం పర్యటనకు సంబంధించి బుధవారం జిల్లా కలెక్టర్ సృజన సంబంధిత అధికారులతో కూడా సమీక్షించారు.

వ్యథ తీరేదెన్నడు..?

- ఇళ్ల రిజిస్ట్రేషన్‌లో ఎదురవుతున్న సమస్యలు - శ్రీమఠం ఆధీనంలో 1500 కుటుంబాల భవిష్యత్తు

- ప్రభుత్వాలు కొనుగోలు చేసి ఇచ్చినా యాజమాన్య హక్కు లేని వైనం - రిజిస్ట్రేషన్ కాకుండా శ్రీమఠం యాజమాన్యం అడ్డంకులు

- ఇళ్లపై రుణాలు ఇవ్వని బ్యాంకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వాలు కొనుగోలు చేసి ఇచ్చిన ఆ స్థలంలో వారు ఇళ్లు నిర్మించుకుని 43 ఏళ్లు గడిచినా వారికి హక్కులు రావడం లేదు. ఇళ్ల రిజిస్ట్రేషన్‌లో సమస్యలు ఎదురవుతున్నాయి. 1500 మంది భవితవ్యం శ్రీమఠం ఆధీనంలో ఉంది. రిజిస్ట్రేషన్ కాకుండా శ్రీమఠం అడ్డంకులు సృష్టిస్తోంది....



మంత్రాలయం గ్రామం ఏరియల్ వ్యూ

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠానికి చెందిన భూములను నాటి ప్రభుత్వాలు కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చాయి. ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి సుమారు 43 ఏళ్లు గడిచినా లబ్ధిదారులకు యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వలేదు. సుమారు 1500 కుటుంబాల భవిష్యత్తు శ్రీమఠం ఆధీనంలో నిలిచింది. 1978-79 సంవత్సరంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే కెఆర్.హనుమంత రెడ్డి నేతృత్వంలో రామచంద్ర నగర్ కాలనీలో సర్వే నెంబర్లు 137/బి1, 138/2లో 25 ఎకరాల్లో 15.50 ఎకరాల ప్రయివేట్ భూమిని రూ.35 వేల చొప్పున కొనుగోలు చేశారు. ఇళ్లు లేని ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 5 సెంట్లు, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలకు 3 సెంట్ల చొప్పున 500 మందికి ఇంటి పట్టాలు అందజేశారు. మళ్లీ 1988-89 మధ్య అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో 67, 68, 112 సర్వే నెంబర్లలో ఎకరా రూ.2 లక్షల చొప్పున శ్రీమఠం నుంచి కొనుగోలు చేశారు. ఇంటి స్థలాలు లేని పేదలకు రాంపురం రెడ్డి సోదరుల సాక్షిగా మంత్రి బీవీ.మోహన్ రెడ్డి చేతులమీదుగా 2 సెంట్ల చొప్పున సుమారు 1000 మంది లబ్ధిదారులకు అందజేశారు. రెండు కాలనీల్లో లబ్ధిదారుల కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగింది. విభాగాలుగా చేసుకుని రూ.లక్షలు ఖర్చు చేసి ఇళ్లను నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. ఏళ్లు గడిచినా ఈ రెండు కాలనీల్లోని ఇళ్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ పేర్లతో రిజిస్ట్రేషన్ కావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇంటి స్థలాలు ఇచ్చిన భూమి ఇప్పటికీ రాఘవేంద్రస్వామి మఠానికి చెందినదిగా ఆన్‌లైన్‌లో ఉంది. రిజిస్ట్రేషన్ కాకుండా చూడాలని 2016 సంవత్సరంలో శ్రీమఠం యాజమాన్యం నుంచి దేవాలయ శాఖకు ఆదేశాలు వచ్చినట్లు సబ్ రిజిస్ట్రార్ చెబుతున్నారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన రికార్డులు మారతాయా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇళ్లు రిజిస్ట్రేషన్ అయితే ఆ పత్రాలను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొంది చిరు వ్యాపారులు చేసుకోవాలని తాపత్రయ పడుతున్న వారికి ఇది పెద్ద సమస్యగా మారింది. ఇంటి పట్టాలపై బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. సర్వే నెంబర్ మార్చి రిజిస్ట్రేషన్ అవుతున్నాయని లబ్ధిదారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పటి ఆదోని నవాబు సిద్ధు మసూద్ ఖాన్ రాఘవేంద్రస్వామిని గుర్తించి మంచాల (మంత్రాలయం) గ్రామాన్ని ఇనాం (దానంగా) ఇచ్చారని చరిత్ర చెబుతోంది. ఇనాం ఇచ్చిన గ్రామంలో ఇన్ని పట్టా భూములు ఎలా వచ్చాయి. గతంలో శ్రీమఠం యాజమాన్యం భూములను అమ్మారా..? లేక శ్రీమఠంలో పనులు చేస్తున్న వారు అనుభవిస్తూ క్రమేణా వాటిని తమ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో మొత్తం భూముల్లో శ్రీరాఘవేంద్ర స్వామి మఠం భూములు 1,516 ఎకరాలు ఉంది. పట్టా భూములు 163 ఎకరాలు, రామలింగేశ్వర స్వామి దేవాలయంపై 7-29 ఎకరాలు, రఘుపతి స్వామి పేరుతో 17 ఎకరాల భూమి ఉంది. నదీ పరంపోగు 31 ఎకరాలు, టెంపుల్ గుట్ట పేరుతో 1-14 ఎకరాలు, బండ పరంపోగు పేరుతో 6-25 ఎకరాలు, రాళ్ల గుట్ట పేరుతో 0-79 సెంట్లు ఉందని రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి.

ఈ రెండు కాలనీల్లో రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించుకున్న ఇళ్లు రిజిస్ట్రేషన్ కాకపోవడం వల్ల కాలనీవాసులకు ప్రధాన సమస్యగా మారింది. తమ భూములు ఆక్రమణకు గురయ్యాయని దేవాలయ శాఖకు శ్రీమఠం యాజమాన్యం ఫిర్యాదు చేసింది. ఇటీవల వైసిపి ప్రభుత్వం అనుభవంలో ఉన్న ఇళ్లు, అసైన్డ్ భూములకు హక్కు కల్పించే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి జిఒను విడుదల చేసింది. ఇంతవరకు ప్రభుత్వం నుంచి జిఒ విడుదల కాలేదని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఇలాంటి సమస్యలు ఉన్న కాలనీవాసులకు యాజమాన్య హక్కులు కల్పించి రిజిస్ట్రేషన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆన్‌లైన్‌లో రెడ్ మార్కు వేశాం

పలు సర్వే నెంబర్లను రిజిస్ట్రేషన్ చేయకుండా నిలుపుదల చేయాలని దేవదాయ శాఖ నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. రిజిస్ట్రేషన్లు కాకుండా ఆన్‌లైన్‌లో రెడ్ మార్కు వేశాం.

- రామదాసు, సబ్ రిజిస్ట్రార్.

మా దృష్టికి తీసుకొస్తే పరిష్కార మార్గం చూస్తాం



1988, 89లో భూ సేకరణ కింద 20 ఎకరాలు ఎకరా రూ.2లక్షల చొప్పున శ్రీమఠం నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేసింది. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మాకు తెలీదు. మా దృష్టికి తీసుకొస్తే పరిష్కార మార్గం చూస్తాం.

- డి.చంద్రశేఖర్, తహశీల్దార్, మంత్రాలయం.

నిమోనియాపై అవగాహన అవసరం

- రాష్ట్రీయ బాల స్వాస్త్య అధికారిని హేమలత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి ఒక్కరూ నిమోనియా వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్త్య అధికారి హేమలత అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని ఎర్రబురుజు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం హేమలత మాట్లాడారు. నిమోనియా సోకితే శ్వాస తీసుకోవడానికి కష్టంగా ఉంటుందన్నారు. జబ్బు ఉన్న వారు తుమ్మితే గాలి ద్వారా బ్యాక్టీరియా వేరొకరికి అంటుకునే ప్రమాదం ఉందన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న ఐదు సంవత్సరముల లోపు పిల్లలు, 65 సంవత్సరములు దాటిన వారికి జబ్బు సోకే అవకాశం ఉందన్నారు. ఈ జబ్బు సోకితే దగ్గు జ్వరము చాతిలో నొప్పి, దగ్గితే గళ్ళ పడడం, చర్మం నీలం రంగులోకి మారడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. రోగులు దగ్గినప్పుడు చేతి రుమాలు అడ్డు పెట్టుకోవాలన్నారు. నిమోనియా రాకుండా ఉండేందుకు పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టించాలని తెలిపారు. తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. తరచూ చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకోవాలన్నారు. తల్లులకు ముఖ్య సూచనలు ఏమంటే ఐదేళ్ల లోపు పిల్లలను నీటి కుళాయిల దగ్గర, నీటి పంపులు దగ్గర నీటి తొట్ల దగ్గర వానలో తడవకుండా, నీటి నిలువలు ఉన్నచోట పిల్లలను ఆడుకోనియరాదని అన్నారు. పిల్లలు నీళ్లలో ఎక్కువగా తడవడం వల్ల దగ్గు, జలుబు, జ్వరం, శ్వాస తీసుకోవడానికి ఇబ్బందితో పాటు నిమోనియాకు గురయ్యే అవకాశం ఉందన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలను వైద్యుల సూచనల మేరకు స్నానం చేయించాలని, శిశువులకు చలిగాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు మాస్ మీడియా సిబ్బంది ఖలీల్ పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న హేమలత

డిసెంబర్ 2, 3న ప్రత్యేక ఓటరు నమోదు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ముసాయిదా ఓటర్ల జాబితా లో ఉన్న పొరపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. బుధవారం కలెక్టరేట్లో రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని , చనిపోయిన లేదా శాశ్వతంగా వేరే ప్రదేశానికి మారిన వారి ఓట్లు తొలగించడానికి ప్రత్యేక ఫారాలను విడి విడిగా ఇవ్వాలని కోరారు. పై సవరణలన్నీ పూర్తి అయిన తర్వాత ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా ఓటర్ల జాబితా జారీ చేస్తామని తెలిపారు. బిఎల్ఒలు, సచివాలయ సిబ్బంది రాజకీయ పార్టీల ప్రతినిధులకు వారు కోరిన సమాచారము ఇవ్వాలని , సహాయ సహకారాలు అందించాలని , ఆ విధంగా సహకరించని వారిని రాత పూర్వకంగా తెలియజేసి నట్లయితే వారి మీద శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 27న సాయంకాలం 4 గంటలకు ఓటర్ల జాబితా పర్యవేక్షకులు మురళీధర్ రెడ్డి కూడా జిల్లాలో పర్యటించనున్నారు.

'సిఎం ఇంటిని ముట్టడిస్తాం'

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి డిఎస్‌సిని విడుదల చేయకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తామని ఎపి నిరుద్యోగ జెఎసి రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిక్, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రవిడ సురేష్ , జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు లు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగ జెఎసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న షేక్ సిద్దిక్, దవిడ సురేష్, శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లలకు ఇచ్చే ఆస్తి,చదువు ఒక్కటే అని నాణ్యమైన విద్య ప్రతి ఒక్కరికి అందాలని పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయ ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి నిరుద్యోగులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్, ఎఐవైఎఫ్ నగర అధ్యక్షులు బాబయ్య, నగరనాయకులు హుస్సేన్ బాష, రాంబాబు, నారాయణ, డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ బలరాం

రగ్బీలో జాతీయ స్థాయికి గురుకుల విద్యార్థి

ప్రజాశక్తి-సి బెళగల్

సి.బెళగల్‌లోని గురుకుల పదవ తరగతి విద్యార్థి జ్ఞానేశ్వర్‌నాయక్ రగ్బీ క్రీడలో రాణించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఇటీవల అండర్ 17లో ప్రతిభ చాటి గురుకుల పాఠశాలకు, కుటుంబానికి మంచి పేరు తెస్తున్నారని ప్రిన్సిపల్ బలరాం మీడియాలో హర్షం వ్యక్తం చేశారు. ఏటా ప్రతి క్రీడలలో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని తెలిపి బుధవారం సిబ్బంది సమక్షంలో అభినందనలు తెలిపారు

నేటి నుండి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల దరఖాస్తుకు వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ ప్రక్రియ గురువారం నుండి ప్రారంభమవుతుందని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మ విజయకుమార్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రిడిటేషన్ కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీమ్ క్రింద ఇంటి స్థలాలను అందించేందుకు ప్రభుత్వం జీవో నెంబర్ 535 ద్వారా వీలు కల్పించిందన్నారు. నవంబర్ 23వ తేదీ నుండి ఈ వెబ్ సైట్ అందుబాటులో ఉంటుందని, 45 రోజుల్లోగా (2024 జనవరి 6వ వరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు.

ఉచిత ప్రత్యేక బయోమెట్రిక్ క్యాంప్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



నగరంలోని దాదాపు 260 మంది వైఎస్ఆర్ పెన్షన్ కానుక లబ్దిదారుల ఆధార్ బయోమెట్రిక్స్ తీసుకోవటంలో ఇబ్బందులు తలెత్తి ప్రతీ నెలా పెన్షన్ల పంపిణీలో సమస్యలు ఎదురవుతున్న దష్ట్యా... నగర పాలక సంస్థ, ఆ లబ్దిదారులను ఉచిత ప్రత్యేక ఆధార్ బయోమెట్రిక్స్ నవీనికరణ క్యాంపును రెండు రోజులపాటు (22 - 23 నవంబర్), కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ నందున్న ఓల్డ్ కౌన్సిల్ హాల్ లో నిర్వహిస్తోంది. ఈ రోజు క్యాంపు ఏర్పాట్లను నగర పాలక అదనపు కమిషనర్ శ్ పి .వి. రామలింగేశ్వర్ పరిశీలించారు.

కారుణ్య నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర పాలక సంస్థలో ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వహిస్తూ తన భర్తను కోల్పోయిన ఓ మహిళకు ప్రభుత్వం తిరిగి అదే ఉద్యోగాన్ని కారుణ్య నియామకం కింద నియమించింది. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని బుధవారం నగర మేయర్ బివై. రామయ్య ఆయన క్యాంపు కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలికి అందజేశారు. నగర పాలక సంస్థలో మల్లెపోగు ఈశ్వరయ్య అనే పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ 2019వ సంవత్సరం సెప్టెంబర్ 15న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య మల్లెపోగు లీలావతికి ప్రభుత్వం అదే ఉద్యోగ అవకాశాన్ని కల్పించింది. కార్యక్రమంలో నగర పాలక అధికారి ఇస్మాయిల్ పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేసిన మేయర్ బివై.రామయ్య

ఘనంగా ములాయం సింగ్ యాదవ్ జయంతి



ములాయం సింగ్ యాదవ్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములయం సింగ్ యాదవ్ జయంతి వేడుకలు సమాజవాది పార్టీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని బిసి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ములయాంసింగ్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. సమాజ్వాది పార్టీ పశ్చిమ రాయలసీమ కో ఆర్డినేటర్ పాండురంగ యాదవ్, నంద్యాల జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్, కర్నూలు జిల్లా అధ్యక్షులు బోయ శ్రీనివాసులు, బిసి సెల్ నేత దాసరి చంద్రశేఖర్, అయ్యన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పాండురంగ యాదవ్ మాట్లాడుతూ ములయం సింగ్ యాదవ్ పోరాటపటిమనుగల బహుజనుల జీవితాల్లో వెలుగులు నింపడానికి అహర్నిశలు శ్రమించిన తీరును పూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. పెరుగు శివకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ పూలే మండల్ మూలయం సింగ్ లాంటి యోధులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. బోయశ్రీనివాసులు మాట్లాడారు.

ఆదర్శనేత జగన్మోహన్‌రెడ్డి: వైసిపి



ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలలు నగరంలోని 25వ వార్డులో ఉన్న 64వ సచివాలయం పరిధిలో ఉన్న లబ్ధిదారులకు డిబిటి, నాన్ డిబిటి ద్వారా జగనన్న ప్రభుత్వంలో సుమారుగా రూ. 7కోట్ల 57లక్షల 50వేల 597 నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యాయని వార్డ్ కార్పొరేటర్ సత్యనారాయణమ్మ తెలిపారు. వార్డులో పార్టీ జెండాను స్థానిక కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, వైసిపి సీనియర్ నాయకులు గడ్డం రామకృష్ణ, వైసిపి సేవాదళ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు, క్లస్టర్ 2 ప్రెసిడెంట్ కేదార్ నాథ్, వైసిపి సేవాదళ్ జోనల్ ఇంచార్జ్ పెరుగు శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటి అమలు చేయకుండా డ్వాక్రా మహిళలను, నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. కర్నూలు శాసనసభ్యులు హఫీజ్ ఖాన్ కోవిడ్ సమయంలో ఉచిత అంబులెన్స్ సేవలను, ప్రతి ఇంటికి నిత్యవసర సరుకులను పంపిణీ చేశారని అన్నారు. 300 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్‌ను ఇప్పటివరకు శ్వాస ఇబ్బంది పడుతున్న వారికి అందజేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమం - అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించారని తెలిపారు. నాయకుడి సమర్థతకి ఇంతకంటే ఏం కావాలని అన్నారు.కర్నూలు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆసిఫ్, సచివాలయ కన్వీనర్లు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న గౌరుచరిత

అరాచకపాలనకు చరమగీతం పాడుదాం : గౌరుచరిత

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన చేస్తుందని ప్రజలు చైతన్యవంతులై రాబోయే ఎన్నికల్లో తగినబుద్ధి చెప్పాలని టిడిపి పాణ్యంఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఓర్వకల్లు మండలం నన్నూరులో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచి రచ్చబండ కార్యక్రమాన్ని గౌరు చరిత నిర్వహించారు. మండల అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నన్నురు గ్రామ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, విజయుడు, మైనారిటీ నాయకులు ఖాజమియ్యా, వార్డ్ మెంబర్ సర్దార్ బెగ్, షేరు, జాకీర్ హుస్సేన్, షఫీ, వెంకట నాయుడు, శేఖర్, చంద్ర శేఖర్, రెడ్డి, మోహన్, వడ్ల బాషా, జనసెన సైనికులు సాయి, వేణు, మండల నాయకులు లక్ష్మీకాంత రెడ్డి పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేయాలి

ప్రజాశక్తి-తుగ్గలి : దేశంలో భూగర్భ జలాలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్ఎన్‌జి సురేంద్రనాథ్ అన్నారు. బుధవారం కడమ కుంట్ల గ్రామంలోని పెద్ద వంకలో రిలయన్స్ ఫౌండేషన్, అపార్డ్ ఎన్‌జిఒ అధ్వర్యం లో రూ.10.5 లక్షలతో నిర్మించిన ఫెర్రోయిక్ చెక్ డ్యాంను ఆ సంస్థ ముంబాయి నుంచి వచ్చిన సిఆర్ ఫోర్ ఎస్‌డి థిమాటిక్ టీం,రిలయన్స్ ఫౌండేషన్ ఎపి ఎస్ఎంజి సురేంద్రనాథ్, కర్నూలు డిఎం కె.కుమార స్వామి రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ తమ సంస్థ భూగర్భ జలాలను పెంపొందించేందుకు కోసమే చెక్ డ్యాంలు నిర్మాణాలు చేపట్టామన్నారు. రైతులు కూడా వర్షం నీరు వృధా కాకుండా తమ పొలాల్లో ఫారం ఫండ్స్ తవ్వుకోవాలని వారు తెలిపారు. ఈ పనులు రైతులకు ఎంతో ఉపయోగకరం గా ఉన్నాయో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ ఎంపిటిసి ఆదిలక్ష్మి , ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.రమేష్, వైజి.తండా సర్పంచి గౌరవ సలహాదారు ఆర్.బాబు నాయక్, మండల ఎక్స్‌టెన్షన్ వర్కర్ జి.సురేష్ బాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



రైతులకు నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలి

- అఖిలపక్ష సమావేశంలో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

జిల్లావ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. బుధవారం పెద్దకడబూరులోని ప్రెస్ క్లబ్‌లో అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశులు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతుసంఘం జిల్లా నాయకులు పరమేష్, కాంగ్రెస్ నాయకులు ఆనందరాజు మాట్లాడారు. మండలంలో అనావృష్టి వల్ల మిరప పంటను రైతులు నష్టపోయారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందజేయాలని కోరారు. అలాగే పత్తి, వేరుశనగకు ఎకరాకు రూ.40 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న, జొన్నలు, సజ్జలు, జొన్నలు, టమోటా పంటలకు ఎకరాకు రూ.30 వేలు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. పులికనుమ ప్రాజెక్టు ద్వారా ఎల్ఎల్‌సి కింద వరి, మిరప పంటలకు డిసెంబర్ ఆఖరి వరకు సాగునీరు ఇవ్వాలని తెలిపారు. ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేసి తాగునీరు, బసలదొడ్డి, పులికనివి, చిన్నతుంబలం, బాపులదొడ్డి, పీకలబెట్ట తదితర గ్రామాలకు సాగునీరు ఇవ్వాలని కోరారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ ఏర్పాటు చేసి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ వీరేంద్రగౌడ్‌కు, ఎఒ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. జోసెఫ్, లక్ష్మన్న, మల్లేష్, జనసేన రాజు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'అన్నదాత' కింద రైతులకు రూ.20 వేలు

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

అన్నదాత పథకం కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు అందించనున్నట్లు టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని సంతేకుడ్లూరు క్యాంపులో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. సూపర్ సిక్స్ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదోనిని తీవ్ర కరువు మండలంగా ప్రకటించడంలో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి ఘోరంగా విఫలం చెందారని విమర్శించారు. అన్నం పెడుతున్న రైతులను మరిచిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, మాజీ ఎంపిపి మురళీ, రాఘవరెడ్డి, ఇంద్రానగర్ వీరేష్, పెద్దతుంబలం శీను, నరసప్ప, నాగేంద్ర, సురేష్, భరత్ కుమార్, సిద్ధ, ఛాయప్ప ఉన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న గుడిసె ఆది కృష్ణమ్మ

సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది

- వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జి నారాయణస్వామి

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే వైసిపి గెలుపునకు నాంది పలుకుతాయని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ ఛైర్మన్ శ్రీనివాసులు, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, యువ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్ తెలిపారు. బుధవారం గుమ్మనూరు గ్రామంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జయరామ్ సోదరుడు, దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పుట్టినరోజు వేడుకలను గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు చిప్పగిరి మండలం నాయకులతో పాటు పలు మండలాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గుమ్మనూరు శ్రీనివాసులు అందరి సమక్షంలో కేక్ కట్ చేశారు. వచ్చిన వారందరికీ విందు ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను ఇప్పుడు వచ్చిన మెజార్టీ కంటే భారీ మెజార్టీ రావడానికి మరింత కష్టపడదామని తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.


గుమ్మనూరు శ్రీనివాసులు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న నాయకులు

అంగన్వాడీ భవనం పూర్తయ్యేనా..?

- గత ప్రభుత్వంలో నిర్మాణం...
- ఈ ప్రభుత్వంలో పూర్తి చేయలేరా..?
- చివరి దశలో నిలిచిన భవనం

ప్రజాశక్తి - చిప్పగిరి

అంగన్వాడీ భవన నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. గత ప్రభుత్వంలో నిర్మాణం మొదలుపెట్టినా ఈ ప్రభుత్వంలో కూడా పూర్తి చేయలేదు. నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

మండలంలోని చాలా గ్రామాల్లో అంగన్వాడీ భవన నిర్మాణాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. మండలంలో 30 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, దాదాపు సగం వరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సంగాల గ్రామంలో నిర్మాణం పూర్తయినా బిల్లులు రాకపోవడంతో అధికారులు కూడా స్వాధీన పరుచుకోలేకపోతున్నారు. మండలంలోని నేమకల్లు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఎంపిపిగా ఉన్న పాముల పద్మావతి గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. స్థలాలు లేకున్నా ఫిల్టర్ వాటర్ కోసం కట్టించిన నిర్మాణం దగ్గర స్థలం ఉండడంతో అంగన్వాడీ భవన నిర్మాణం చేపట్టడానికి అన్ని అనుమతులూ మంజూరు చేయించారు. గ్రామంలో ఉన్న గుత్తేదారునితో నిర్మాణం చేపట్టడానికి అనుమతి ఇచ్చారు. గత ప్రభుత్వంలో జరిగిన నిర్మాణం మాత్రమే జరిగిందని గ్రామస్తులు తెలుపుతున్నారు. సంబంధిత గుత్తేదారుని సంప్రదించగా అంగన్వాడీ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.8 లక్షలు మంజూరు చేసిందని, నిర్మాణం చివరి దశకు వచ్చి ఐదేళ్లు కావస్తున్నా తమకు బిల్లులు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణం కోసం అధిక వడ్డీలకు అప్పు చేశామని, ప్రభుత్వం మారినా బిల్లులు మంజూరు కాలేదని తెలిపారు. ఒక ప్రభుత్వంలో చేపట్టిన నిర్మాణాలు మరో ప్రభుత్వంలో ఆగ పోవాల్సిందేనా, బిల్లులైన చెల్లించారా అంటే అది కూడా లేదని గుత్తేదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు మంజూరయితే చివరి దశ పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


నేమకల్లులో మధ్యలో నిలిచిపోయిన అంగన్వాడీ భవన నిర్మాణం


పాఠశాల ఆవరణలో ఉన్న వీధి కుక్కలు

వీధి కుక్కలతో బెంబేలు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

వీధి కుక్కలతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. హోళగుందతోపాటు మండలంలోని ఎల్లార్తి, వందవాగిలి, గజ్జహళ్లి, హెబ్బటం, సులువాయి తదితర గ్రామాల్లో ఏ వీధిలోకి వెళ్లినా కుక్కల దండు దర్శనమిస్తుండడతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కుక్కల నుంచి ఎలా తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఆదమరిచి తిరిగితే.. కుక్క కాటుకు గురవ్వక తప్పదు. రాత్రి 8 గంటలు దాటితే ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని వెంటాడి కొరికే ప్రయత్నం చేస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు కుక్కలు వీధిలో ఒకటో, రెండో ఉండేవి. అవి కూడా కొత్త వ్యక్తులు ఆ వీధులకు ప్రవేశిస్తేనే మొరిగేవి. ఇప్పుడు అలా కాకుండా ప్రతి వీధిలోనూ ఎటు చూసినా కుక్కలే కనబడుతున్నాయి. అత్యవసర సమయంలో కాలినడకన బయల్దేరితే వెంట పడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇంటి కాపలాగా ఉండే కుక్కలు సైతం ఇంటి యజమానులకూ కొరికిన సంఘటనలు ఉన్నాయి. చిన్నారుల పరిస్థితి మరి దారుణం. తల్లిదండ్రులు జాగ్రత్త పడకపోతే పడకపోతే ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది. ముందస్తు చర్యగా హోళగుంద పంచాయతీ అధికారులు స్పందించి గ్రామం నుంచి కుక్కలను బహిష్కరించేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కరువు ప్రాంత విద్యార్థులకు
ఫీజులు రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

ప్రజాశక్తి - ఆదోని

కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దు చేసి కరువు స్కాలర్‌షిప్ రూ.10 వేలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్ ఆవరణలో ఎస్ఎఫ్ఐ 6వ పట్టణ మహాసభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్లా మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా కరువు కాటకాలతో అల్లాడుతుంటే ప్రయివేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం మాత్రం విద్యార్థులను ఫీజులు చెల్లిస్తేనే పరీక్ష ఫీజు తీసుంటామని హుకుం జారీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో వర్షాల్లేక, పంటలు పండక, ప్రజలకు ఉపాధి లేక వలస వెళ్తూ చదువుతున్న విద్యార్థులను వారి వెంట తీసుకెళ్తున్నారని, చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వలసలను నివారించడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వలస బాధిత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు భరించాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. జిల్లావ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ తిరుపతి శాఖ నాయకులు రవి, డివైఎఫ్ఐ మాజీ నాయకులు లక్ష్మన్న, దినేష్, గౌస్, పవన్, నాగరాజు, గణేష్, రాజు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న అబ్దుల్లా

రాష్ట్రం వైపు దేశం చూపు

- వైసిపి ఇన్‌ఛార్జి జయ మనోజ్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయ మనోజ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆదోనిలోని 27వ వార్డు ఫరిస్వా మొహల్లాలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 14 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు రాష్ట్ర బడ్జెట్‌ను కొల్లగొట్టి టిడిపి కార్యకర్తలకు, జన్మభూమి కమిటీల ద్వారా దోచిపెట్టి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. రాష్ట్రం నుంచి జగన్మోహన్ రెడ్డిని ఎవరూ వేరు చేయలేరని, 2024లో తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, సన్నీ, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు నరసింహులు, ఎంఎంజి.గౌస్, కౌన్సిలర్ ఫయాజ్, బాసు భాయ్, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షులు నియాజ్ అహ్మద్, ఖాదర్, వార్డు ఇన్‌ఛార్జి హాజీ ఖాదర్, రహీం, బాలాజీ, లాలు, చిరంజీవి, జైపాల్, మమత, స్వామి, సింహం నాగేంద్ర, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, అబు బాకర్ పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న జయ మనోజ్ రెడ్డి

రిజిస్టర్ మేటీలకు శిక్షణ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలో రిజిస్టర్ అయిన మేటీలకు ఎంపిడిఒ ఆదేశాల మేరకు ఎపిఒ రామన్న, ఈసీ ఖాదర్ బాష ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. మేటీల విధులు, బాధ్యతలు, డిమాండ్ ఎలా తీసుకోవాలి, వర్క్ అలోకేషన్, మస్టరు హాజరు వేయడం, మొబైల్‌లో మొదటి ఫొటో, రెండో ఫొటో అప్‌లోడ్ చేసే విధానం, పనులకు కొలతల మార్కింగ్ ఇవ్వడం, పండ్ల తోటల పెంపకం, వలసల నివారణ, జాబ్ కార్డు అప్‌డేట్ చేయడంపై శిక్షణ ఇచ్చారు.


శిక్షణలో పాల్గొన్న మేటీలు


క్రీడాకారులతో ఉన్న రామన్న

ఆదోనిలో కబడ్డీ క్రీడాకారులకు శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడకు ఎంపికైన 12 మంది విద్యార్థినులకు బుధవారం శిక్షణ ఇచ్చినట్లు కోచ్ రామన్న తెలిపారు. చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన విద్యార్థినులకు 17 నుంచి 22 వరకు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ కోసం మైదానాన్ని అనుమతించిన ఆర్ట్స్ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. టీమ్ మేనేజర్ హరిత, పిఇటిలు నరసింహులు, గంగాధర్ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు సమాయత్తం

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి నిర్వహించే సమ్మెకు అంగన్వాడీలు సమాయత్తం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. బుధవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు విశాలాక్షి అధ్యక్షతన కార్యాలయ సిబ్బంది షేక్షావలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను విస్మరించారని, డిసెంబరు 8 నుంచి జరిగే అంగన్వాడీల సమ్మెకు సిద్ధం కావాలని కోరారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలో అంగన్వాడీలకు వేతనాలు పెరిగినప్పటికీ ఆంధ్రలో మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి ఇస్తానని జగన్ ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయిందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే అనేక రూపాల్లో అంగన్వాడీలు నిరసనలు, ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. తప్పనిసరి పరిస్థితుల్లో డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, సిఐటియు కోసిగి మండల కార్యదర్శి వీరేష్, మంత్రాలయం కార్యదర్శి జయరాజు, యూనియన్ నాయకులు ఎబిషా రాణి, సుకన్య, చిట్టెమ్మ పాల్గొన్నారు.


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అంగన్వాడీ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక

అంగన్వాడీ యూనియన్ మంత్రాలయం ప్రాజెక్టు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా ఎబిషా రాణి, నూతన కార్యదర్శిగా విశాలాక్షి, ఉపాధ్యక్షుగా విజయలక్ష్మి, జయమ్మ, సహాయ కార్యదర్శులుగా గంగమ్మ, జయలక్ష్మి, ట్రెజరర్‌గా ఉషమ్మ, కమిటీ సభ్యులుగా భీమేశ్వరి, లావణ్య, మీనాక్షి, రాధ, శోభా, మద్దమ్మ, సుజాత, ఉషా, శారదమ్మ, సోమేశ్వరి, లక్ష్మిదేవి, వసంత ఎన్నికయ్యారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు

- కళాశాల ప్రిన్సిపల్ ఆదినారాయణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలులోని ఐఎఎస్ఇ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.ఆదినారాయణ రెడ్డి ఒక ప్రకటనలో బుధవారం పేర్కొన్నారు. తెలుగు సోషల్ మ్యాథమెటిక్స్ సైకాలజీ సబ్జెక్టులను బోధించేందుకు ఎంఇడి పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 28 లోగా దరఖాస్తులు తమ కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు.


సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

జాతీయ స్థాయి పోటీలకు గూళ్యం విద్యార్థులు

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి మండల గూళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపి తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లితండ్రులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 19 నుంచి 21 వరకు నంద్యాల జిల్లా మిడుతూరులో జరిగిన 67వ రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీల్లో కర్నూలు జిల్లా నుంచి గూళ్యం పాఠశాల విద్యార్థి డి.హారిక, బాలుర విభాగంలో జె.శశిధర్ ఎంపికయ్యారని తెలిపారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి షాట్ బాల్ పోటీల్లో టి.శంకర్, గుంటూరులో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో కె.భారతమ్మ ఎంపికయ్యారని చెప్పారు. భవిష్యత్తులో మరిన్నీ పోటీల్లో రాణించాలని, పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతాప్ కృషిని అభినందించారు.

ఎంపిసి విద్యార్థుల వివరాలు నమోదు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి విద్యార్థుల వివరాలను హెచ్‌సిఎల్‌లో వివరాలు నమోదు చేయాలని ఉమ్మడి జిల్లా ఆర్ఐఒ గురువయ్య శెట్టి పేర్కొన్నారు. బుధవారం ఆర్ఐఒ కార్యాలయం నుండి ఆయన వెబ్‌నార్ ద్వారా ఉమ్మడి జిల్లా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్‌తో సమావేశం నిర్వహించారు. హెచ్‌సిఎల్ కంపెనీలో ఎంపిసి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సదరు కంపెనీ ఒప్పందం చేసుకుందామని అన్నారు. అందుకు విద్యార్థుల వివరాలను రిజిస్ట్రేషన్ చేయాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

ఒపిఎస్‌ను అమలు చేసిన వారికే మద్దతు

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప

ప్రజాశక్తి - నందవరం

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వారికే రాబోయే ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప తెలిపారు. బుధవారం నందవరం ప్రాథమిక పాఠశాలలో సమావేశం మండల అధ్యక్షుడు ఆర్.వెంకట్రాముడు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎల్లప్ప హాజరయి మాట్లాడారు. పాలకవర్గాలు ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ప్రతిపక్ష నేత హోదాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వారంలోపు సిపిఎస్‌ను విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నాలుగేళ్ల కాలయాపన చేసి చివరకు సిపిఎస్ రద్దు సాధ్యం కాదని.. జిపిఎస్ పేరుతో గ్యారెంటీ లేని 'గ్యారెంటెడ్ పెన్షన్ స్కీమ్' అమలు చేస్తామని దగా చేశారని విమర్శించారు. ఒపిఎస్ తప్ప ఎలాంటి ప్రత్యామ్నాయాన్ని యుటిఎఫ్ అంగీకరించడం లేదన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎస్.దావీదు, ఎ.దేవపాల్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు, విద్యను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లలో అడుగు పెట్టిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించామని, ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని తెలిపారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు వ్యవహరించారు. గౌరవాధ్యక్షులుగా దుబ్బన్న, గౌరవ సలహాదారులుగా అబ్దుల్ రహమాన్, బాబురావు, అధ్యక్షులుగా ఆర్.వెంకట్రాముడు, సహాధ్యక్షులుగా కె.హుస్సేని, పద్మావతి, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాగ రాజు, కార్యదర్శులుగా జె.రంగన్న, బి.సురేష్, టి.నాగరాజు, డి.ఇస్సాక్, ఎం.మహేశ్వరి, త్రివేణి, సురేంద్రబాబు, ఎస్.మహబూబ్ బాష, ఎస్.బాబు, ఆడిటర్‌గా ఎస్.ఆంజనేయులు, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.పరమేష్, ఎ.విరుపాక్షి, కె.రాజు, ఎం.మహేశ్వరి, సిపిఎస్ కన్వీనర్‌గా కె.భాగ్యరాజు, మహిళా విభాగం కన్వీనర్‌గా ఎం.ఉమాదేవి, అకాడమిక్ విభాగం కన్వీనర్‌గా జె.వీరభద్రయ్య, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా ఎం.నరసన్నను ఎన్నుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లప్ప

లా యూనివర్సిటీకి
సంజీవయ్య పేరు పెట్టాలి

- మాలమహానాడు యువదళం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కర్నూలు నగర పరిధిలోని కల్లూరు మండలం లక్ష్మీపురం జగన్నాథ గట్టుపై నిర్మిస్తున్న లా యూనివర్సిటీకి మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మల్లేష్, యువదళం జిల్లా అధ్యక్షులు గుడికల్ నల్లన్న, సెక్రటరీ రాముడు, బలరాం డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మాల మహానాడు కార్యాలయంలో వారు మాట్లాడారు. జిల్లా పునర్విభజన జరిగిన తర్వాత కూడా జగన్‌కు దామోదరం సంజీవయ్య గుర్తుకు రాకపోవడం బాధాకరమన్నారు. సొంత ఇల్లు కూడా లేని నిస్వార్థ రాజకీయ నాయకుడు సంజీవయ్య అని కొనియాడారు. జిల్లాకు దామోదరం సంజీవయ్య పెట్టాలని నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు చేసినా అసెంబ్లీలో కనీసం దామోదరం సంజీవయ్య పేరు లేవనెత్తలేదని చెప్పారు. డిసెంబర్‌లో భూమి పూజకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్ లా యూనివర్సిటీకి సంజీవయ్య యూనివర్సిటీగా నామకరణం చేసి దళిత పక్షపాతి అని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. పరమేష్, దామోదర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యువ దళం నాయకులు

ఉపాధ్యాయుని చిన్ననాటి స్నేహితుల దాతృత్వం


ప్రముఖుల ఫొటోలను విద్యార్థులకు అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్న బి.రామన్న చిన్ననాటి స్నేహితులు దాతృత్వం చాటుకున్నారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో స్థిరపడిన ఆర్‌వి కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజశేఖర్ రామన్న పిలుపు మేరకు పాఠశాలలోని బాలికల కోసం రూ.12 వేల విలువ చేసే క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. బెంగళూరులో స్థిరపడిన ఐకాన్ ఇంజినీరింగ్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.నూరుల్లా అనే మరో మిత్రుడు పాఠశాలకు రూ.30 వేల విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. కర్నూలులో స్థిర పడిన సహస్ర ఇండస్ట్రీస్ సంస్థ అధినేత యుకె.శ్రీనివాసులు రూ.15 వేల విలువ చేసే దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన జాతీయ నాయకుల ఫొటోలను విరాళంగా అందించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులు రామన్న మాట్లాడారు. పాఠశాల విద్యాభివృద్ధికి అవసరమైతే మరిన్ని విరాళాలు అందించడానికి వారు సిద్ధంగా ఉన్నారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు అంపయ్య పాల్గొన్నారు.


వైసిపి జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమ పథకాలే వైసిపిని గెలిపిస్తాయి

- వైసిపి మండల ఇన్‌ఛార్జి విశ్వనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా సంక్షేమ పథకాలే మళ్లీ వైసిపిని గెలిపిస్తాయని వైసిపి మండల ఇన్‌ఛార్జి సి.విశ్వనాథ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు 'ఏపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ముందుగా వైసిపి జెండాను ఆవిష్కరించి, ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధిదారులకు అందించిన పథకాలకు సంబంధించి న బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలుపై ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆశ్చర్యంగా చూస్తూ ఆదర్శంగా తీసుకొంటున్నారని తెలిపారు.

విద్యార్థి సమస్యలపై నిరంతర పోరాటం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలు, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప పేర్కొన్నారు. బుధవారం గోనెగండ్లలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు నరసింహులు, దండు ఖాజా, రామన్ హాజరై మాట్లాడారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు దండు ఖాజా ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా సి.పవన్, కార్యదర్శిగా ఎం.రంగస్వామి, ఉపాధ్యక్షులుగా హుస్సేన్, ఖాసీం, లాజర్, స్వర్ణలత, అరవింద్, ఓంకార్, జుబేర్, వినయ్, రియాజ్‌ను ఎన్నుకొన్నారు.


మాట్లాడుతున్న మాజీ నాయకులు






మీడియాతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

పేదల భూమి పెద్దల చేతుల్లో..

- పరాధీనమైన అసైన్డ్ భూములు
- 25 శాతం మాత్రమే పేదల స్వాధీనంలో..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పేదల భూమి పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయింది. 2003కు పూర్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములు పరాధీనం అయ్యాయి. 25 శాతం మాత్రమే పేదల చేతుల్లో ఉన్నాయి. మిగిలిన 75 శాతం భూమి ఇతరుల స్వాధీనంలో ఉంది.



పేదలకు 2003కు పూర్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములపై పూర్తి స్థాయి హక్కు పత్రాలు ఇచ్చేందుకు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయి సర్వే పూర్తి చేసింది. నంద్యాల జిల్లాలో మొత్తం అసైన్డ్ భూముల్లో 25 శాతం భూమి మాత్రమే అసైనీలు, వారి వారసుల సాగులో ఉందని, ఆ మేరకు మాత్రమే హక్కు పత్రాలు అందజేయాలని అధికారులు నిర్ధారించారు. పేదలకు పంపిణీ అయినవాటిల్లో 75 శాతం విస్తీర్ణంలోని భూములు నిబంధనలకు విరుద్ధంగా భూస్వాములు, పెద్దల స్వాధీనంలోకి వెళ్లిపోయినట్లు వారే అనుభవిస్తున్నట్లు సర్వేలో గుర్తించారు. పారదర్శకంగా ఉండాల్సిన ఈ భూములకు సంబంధించిన సమాచారాన్ని అధికార యంత్రాంగం గోప్యంగా ఉంచడం పలు సందేహాలకు తావిస్తోంది. అసైన్డ్ భూములపై తాజా ఆర్డినెన్స్ తీసుకొచ్చే క్రమంలో ఏయే గ్రామంలో ఎంత అసైన్డ్ భూమి ఉంది? ఎవరి పేరుతో పట్టా ఉంది? ఎవరి స్వాధీనంలో ఆ భూమి ఉంది? అనే వివరాలను గ్రామ సచివాలయాలు, పంచాయతీల నోటీసు బోర్డుల్లో ఉంచుతామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. కానీ, క్షేత్రస్థాయిలో ఇది ఆచరణకు నోచుకోవడం లేదు. నోటీసు బోర్డుల్లో ఎక్కడా అసైన్డ్ భూముల వివరాలు, లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించలేదు. పెద్దల స్వాధీనంలోని అసైన్డ్ భూముల వివరాలు బహిర్గతం కాకుండా ఉండేందుకే పారదర్శకత పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

20 ఏళ్ల క్రితమే అసైన్డ్ భూములకు డి-ఫారం పట్టాలు పొందిన వాస్తవ లబ్ధిదారులు, వారసుల స్వాధీనంలోని అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం 9/23 ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో పంపిణీ అయిన భూములు ఎవరి స్వాధీనంలో ఉన్నాయో నిర్ధారించేందుకు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేసింది. నంద్యాల జిల్లాలో పంపిణీ చేసిన 1,25,099 ఎకరాల అసైన్డ్ భూమిలో కేవలం 31,970 ఎకరాలు మాత్రమే వాస్తవ లబ్ధిదారుల స్వాధీనంలో ఉన్నట్లు తేల్చారు. మిగిలిన భూమి ఎకరాల భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ భూముల్లో గృహ సముదాయాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారు. దున్నేవానికే భూమి నినాదంతో గతంలో పెద్ద ఎత్తున జరిగిన భూ పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వాలు భూములను పేదలకు పంపిణీ చేశాయి. దళితులు, గిరిజనులు, ఇతర పేదలకు డి-ఫారం పట్టాలు పొందారు. భూమి లభ్యతను ఆసరా చేసుకుని జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా 20 సెంట్ల నుంచి 2.5 ఎకరాల వరకు లబ్ధిదారులకు పంపిణీ జరిగింది. ఈ భూములను పొందిన లబ్ధిదారుల కుటుంబాలు సేద్యం చేసి ఫలసాయం పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో ఈ భూముల క్రయ విక్రయాలను ప్రభుత్వం నిషేధించింది. అసైన్డ్ భూములను లబ్ధిదారులు అమ్మడం, లబ్ధిదారుల నుంచి కొనడం నేరమని పేర్కొంది. ఈ భూముల క్రయవిక్రయాలు జరిగితే ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ (పిఒటి) చట్టం కింద రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలి. కానీ, పాలకులు ఈ చట్టం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పేదల పేరున పట్టాలు ఉన్నా అసైన్డ్ భూముల్లో అత్యధిక శాతం అనధికారికంగా పెద్దల స్వాధీనంలోకి వెళ్లిపోయాయి.

పెద్దలకు కట్టబెట్టేందుకే..



పేద భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ప్రభుత్వం అసైన్డ్ భూములకు సంబంధించి ఆర్డినెన్స్ తీసుకు వచ్చింది. ఇప్పటికే చాలా మంది అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్నారు వారు ఉన్నారు. వాళ్లను ప్రభుత్వం గుర్తించకుండా పెద్దలకు రెగ్యులర్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. అనుకూలమైన వాళ్లకు కట్టబెడుతున్నారు. పేదలకు ఉపయోగపడే విధంగా చేయడం లేదు. నిజమైన లబ్ధిదారులకు అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వాలి.

- టి.రమేష్ కుమార్, సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి.

విద్యుత్ ప్రైవేటీకరణ

సవరణ బిల్లు రద్దు చేయాలి

- కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు పెట్టిన విద్యుత్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శి వి.యేసురత్నము, ఎ.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. కార్పొరేట్లకు కారు చౌకగా విద్యుత్ రంగాన్ని కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లు-2020ని తీసుకువచ్చిందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత 10 సంవత్సరాల కాలంలో ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. కానీ ప్రజల సంస్థ అయిన విద్యుత్ సంస్థను ఆదానీ చేతుల్లో పెట్టేందుకు సవరణ బిల్లు తీసుకురావడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు విద్యుత్ సవరణ బిల్లుకి మద్దతు ఇవ్వకూడదని కోరారు. మోడీ ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలను వెనక్కి తీసుకోకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ అయితే ప్రజలపై తీవ్ర భారాలు పడతాయన్నారు. యూనిట్ పది రూపాయలు పైగా అవుతుందని చెప్పారు. ప్రజలందరూ విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కలిసి రావాలని కోరారు. రాష్ట్రంలోనూ విద్యుత్ జనరేషన్ కంపెనీలను ఆదానికి కట్టబెట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే దామోదరం సంజీవయ్య (కృష్ణపట్నం) థర్మల్ పవర్ స్టేషన్‌ను ఆదానికి అప్పగించారని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ పంపుసెట్లకు కరెంటు మీటర్లు బిగించారని చెప్పారు. ఇళ్లకి స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై భారాలు మోపేందుకు ఆదానికి కాంట్రాక్ట్ అప్పగించారన్నారు. ఐదుసార్లు పైగా ఇప్పటికే కరెంటు చార్జీలు జగన్ ప్రభుత్వం పెంచిందని, బిల్లులో కరెంటు అసలు వాడకానికన్నా బిల్లు కన్నా ఐదు రకాల చార్జీలు వేసి భారం వేస్తున్నారన్నారు. మోడీ, జగన్మోహన్ రెడ్డి విద్యుత్ ప్రైవేటీకరణ విధానాల్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. విద్యుత్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

జగన్‌తోనే సామాజిక సాధికారత

- ఉప ముఖ్యమంత్రులు అంజాద్ బాషా, నారాయణ స్వామి

ప్రజాశక్తి - బనగానపల్లె

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సామాజిక సాధికారత సాధ్యమని ఉప ముఖ్యమంత్రులు అంజాద్ బాషా, నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. పట్టణంలోని అవుకుమెట్ట వద్ద నుండి పెట్రోల్ బంకు కూడలి వరకు బస్సు యాత్ర సాగింది. పెట్రోల్ బంకు కూడలిలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రులు అంజాద్ బాషా, నారాయణ స్వామి మాట్లాడుతూ 75 సంవత్సరాలలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆయా వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసినట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ ఎస్సీ ఎస్టీ ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పదవులను ఇచ్చి పాలనలో భాగస్వాములను చేశారన్నారు. నవరత్నాల కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నేరుగా కోట్లాది రూపాయలను బ్యాంకు ఖాతాల్లో జమ చేసి ఆయా వర్గాల ప్రజలను ఆదుకున్నట్లు తెలిపారు. కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా బటన్ నొక్కి ప్రజల బ్యాంకు ఖాతాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నగదును జమ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమం కోసం ఏ రోజు పాటుపడలేదని విమర్శించారు. ప్రజలను నమ్మించి మోసం చేసే నైజం చంద్రబాబుదని, నమ్మిన ప్రజల కోసం పని చేసే నైజం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదని తెలిపారు. ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం పనిచేసే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి, నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ రావు, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, ఎంపీపీ మానసవీణ, జడ్పిటిసి సభ్యులు చల్లా శ్రీలక్ష్మి, సుబ్బ లక్ష్మమ్మ, వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వర్‌రెడ్డి, వైసీపీ బనగానపల్లె మండల కన్వీనర్ సన్నాల జనార్ధన్ రెడ్డి, నాయకులు అబ్దుల్ ఫైజ్, అత్తార్ జాహిద్ హుస్సేన్, జిల్లెల్ల శంకర్ రెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, సురేష్, బొబ్బల రాజశేఖర్ రెడ్డి, సాదుల శివశంకర్ రెడ్డి, అధిక సంఖ్యలో ప్రజలు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే కాటసాని

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా పెట్రోల్ బంకు కూడలిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో 4,94,661 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.11,086 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జమ చేసినట్లు తెలిపారు. టిడిపి నాయకులు ఓటుకు నాలుగు వేలు ఇచ్చి ఓట్లను కొనుగోలు చేస్తామని పేర్కొంటున్నారని, జగన్మోహన్ రెడ్డి అభిమానం, ప్రేమ ముందు ఎన్ని వేలిచ్చినా ప్రజలు టిడిపికి ఓట్లు వేయరని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. జగన్మోహన్ రెడ్డి మళ్ళీ అధికారంలోనికి వస్తేనే సంక్షేమ పథకాలు వస్తాయని తెలిపారు. టిడిపి నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి



మాట్లాడుతున్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మహాధర్నాను జయప్రదం చేయండి

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్

ప్రజాశక్తి - మిడుతూరు

విజయవాడలో ఈ నెల 27, 28వ తేదీల్లో రైతు సమస్యలపై జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ కోరారు. మహాధర్నా విజయవంతం చేయాలనికోరుతూ బుధవారం మిడుతూరు, చింతలపల్లి, జలకనూరు గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పి ఓబులేసు, రైతు సంఘం నాయకుడు శివరాముడుతో కలిసి కరపత్రాల పంపిణీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వల్ల మిడుతూరు మండలంలో అన్ని పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామాల్లో కుటుంబానికి రెండు వందల రోజులు పని దినాలు పెట్టాలని, రోజుకు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ. 600 వేతనం ఇవ్వాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసి ప్రజలపై భారాలు మోపేందుకు చూస్తున్నాయని విమర్శించారు. కార్మికులు, రైతులు వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27, 28న విజయవాడలో జరిగే మహాధర్నాలో కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జలకనూరు గ్రామ రైతులు షేక్షావలి, రమణయ్య, శ్రీనివాసులు, సుబ్బన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** ఈ నెల 27, 28న విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, మండల నాయకులు గుర్రం శంకరయ్యలు రుద్రవరం, అప్పనపల్లి, పెద్ద కంబలూరు, చిన్న కంబలూరు, కొండమాయపల్లి, నరసాపురం, రెడ్డిపల్లి గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాధర్నాలో రుద్రవరం మండలంలోని రైతులు ,కూలీలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



జలకనూరు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేస్తున్న రైతు సంఘం నాయకులు

24 వరకే తెలుగు గంగ నుండి సాగు నీరు

- నీటి పారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రమణయ్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ఈ నెల 24వ తేదీ వరకు మాత్రమే తెలుగు గంగ నుండి పంట పొలాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు నీటి పారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీరు వెంకట రమణయ్య తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగు గంగ రిజర్వాయర్ నుండి 2 వేల క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తెలుగంగ ప్రాజెక్టులో రెండు టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని, ఈ నీరు కేవలం వచ్చే వేసవిలో తాగునీటి కోసం ఉంచామన్నారు. ప్రాజెక్ట్‌లో నీళ్లు పూర్తి స్థాయిలో లేనందు వలన రైతులు అర్థం చేసుకోని రబీలో తెలుగు గంగ కింద సాగు చేసుకోవద్దని, బోరు బావుల కింద మాత్రమే సాగు చేసుకోవాలని, అదికూడా కేవలం ఆరుతడి పంటలే సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. గోరుకల్లు, అవుక్ రిజర్వాయర్‌ల కింద ఉన్న ఆయకట్టుకు డిసెంబర్ చివరి వరకు మాత్రమే సాగునీరు ఇవ్వనున్నట్లు తెలిపారు.

అంతర్ జిల్లా ఖోఖో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని ఎద్దుల పాపమ్మ పాఠశాలలో 67వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-19 బాయ్స్ అండ్ గర్ల్స్ ఖోఖో ఛాంపియన్ షిప్ క్రీడా పోటీలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాలేజీ ప్రిన్సిపల్ రామ సుబ్బన్న, పట్టణ సీఐ రమేష్ బాబు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ సీతారామిరెడ్డి, కర్నూల్ జిల్లా ప్రెసిడెంట్ శంకర్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎద్దుల పాపమ్మ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పట్టణ సిఐ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. క్రీడాకారులు ఎక్కువగా పోలీస్ డిపార్ట్మెంట్లో చేరుతారని, ధైర్యం, సాహసాలతో ప్రజలకు ఎంతో సేవ చేస్తారని తెలిపారు. స్కూల్ గేమ్ సెక్రెటరీ శివ కుమార్ మాట్లాడుతూ ఒక వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రధానోపాధ్యాయుడైతే ఎలా ఉంటుందో పాఠశాలను తీర్చిదిద్ది ఒక మార్గదర్శకంగా ముందుకు వెళుతున్న ప్రధానోపాధ్యాయులు వీరరాఘవయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ నాగ శేషులు, అసోసియేషన్ ట్రెజరర్ సోమన్న, ప్రముఖ వైద్యులు రామ సుబ్రహ్మణ్యం, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్, ప్రతాప్, శ్రీనివాస్ రెడ్డి, శంకరయ్య, దేవానంద, బాబు, దేవేందర్, నాగేంద్ర, నరసింహులు, పద్మ, రాణి, శశికళ తదితరులు పాల్గొన్నారు.



వచ్చే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలి

- ఎపి రైతు సంఘం, వృకాసం

ప్రజాశక్తి - బేతంచెర్ల

నిత్యవసర సరుకుల ధరలు తగ్గించలేని కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓటుతో సాగనంపాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఆర్.ఈశ్వరయ్యలు కర్షక, కార్మికులను కోరారు. ఈ నెల 27, 28వ తేదీలలో విజయవాడలో జరుగు మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం మండలంలోని కొలుములపల్లె గ్రామంలో ఆటో ప్రచార జాతాను రెండో రోజు నిర్వహించారు. రైతుసంఘం మండల అధ్యక్షుడు సీతారాపురం వెంకటేశ్వర్లు, సిఐటియు మండల కార్యదర్శి ఎస్.రహంతుల్లా అధ్యక్షతన ఆటో ప్రచార జాతా ప్రారంభించారు. ఈ సందర్భంగా వి.సుబ్బరాయుడు, ఆర్.ఈశ్వరయ్యలు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నాయకులు ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వస్తే నిత్యవసర సరుకులు ధరలు నియంత్రిస్తామని ప్రజలకు మోసపూరిత మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించారన్నారు. నిత్యవసర సరుకులు ధరలు తగ్గించకపోగా రాష్ట్రంలోని ప్రకృతి సంపదను ఆదానీ, అంబానీలకు కారు చౌకగా కట్టబెడుతుంటే రాష్ట్ర పాలకులు చూస్తూ ఉండిపోవడం దారుణమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ఈ నెల 27, 28వ తేదీలలో విజయవాడలో జరుగు మహా ధర్నాను విజయవంతం చేయడానికి కర్షకులు, కార్మికులు ఐక్యమై రావాలని కోరారు. రెండవ రోజు మండలంలోని 16 గ్రామాలలో ఆటో ప్రచార జాతా కొనసాగింది. ఈ ప్రచార జాతాలో కర్షకులు, కార్మికులు పాల్గొన్నారు.



మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



పోలీస్ స్టేషన్ వద్ద చెడిపోయిన బోరింగ్

మరమ్మతులకు నోచని బోరింగ్

- నీటి కోసం ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి - సంజామల

సంజామల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద బోరింగ్ చెడిపోయి రెండు నెలలు దాటినా మరమ్మతులకు నోచుకోవడం లేదు. సంబంధిత స్థానిక అధికారులకు చెప్పినా ఇంతవరకు రిపేరీ చేయడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామంలోకి పాలేరు వాగు నుంచి పైపులైన్ ద్వారా నీళ్లు వచ్చేవి. ప్రస్తుతం పాలేరు వాగు సరిగా ప్రవహించకపోవడంతో నీళ్లు ఒక్కొక్క సమయంలో రావడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు బోరింగు కూడా పని చేయకపోవడంతో స్థానికులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని బోరింగ్‌కు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుని నీటి సమస్య లేకుండా చూడాలని స్థానిక మహిళలు, ప్రజలు కోరుతున్నారు.

పేదల గృహ నిర్మాణాలకు అనుమతులివ్వాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

సుండిపెంట గ్రామపంచాయతీ పరిధిలో పేదలు నిర్మించుకుంటున్న గృహాలకు అనుమతులు ఇవ్వాలని ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుండిపెంట గ్రామ పంచాయతీ సచివాలయం-2లో పంచాయతీ కార్యదర్శి బాలు నాయక్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుండి పెంట గ్రామంలో కొంత మంది రోజు వారి కూలి పనులు చేసుకొని జీవిస్తున్నారని, వీరంతా పూరి గుడిసెలలో, రేకుల షెడ్లలో నివసిస్తున్నరని తెలిపారు. వీరు డ్యామ్ నిర్మాణ పనుల కోసం వచ్చి ఇక్కడే స్థిరపడ్డారన్నారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో పూరి గుడిసెలలో జీవనాన్ని కొనసాగిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం వారు, వారి పిల్లలు పెరిగి కొంత ఆర్థికంగా సమకూర్చుకొని నివాసం ఉంటున్న గుడిసెలను పడేసుకొని గృహాలు కట్టుకుంటున్న దశలో ఉన్న ఫలంగా నిర్మాణాలు నిలిపి వేయడం బాధాకరమన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లి ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు అనుమతులు ఇప్పించాలని కోరారు. స్పందించిన ఆయన అర్జీని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వై.శీను, వెంకటేశ్వర్లు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాలలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో గత మూడు రోజులుగా అధ్యాపక బృందానికి పరిశోధన పత్రాల ప్రచురణలో మెలకువలు అనే అంశంపై జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కెఎస్ గుప్తా హాజరై మాట్లాడారు. అధ్యాపకులు ఒక పరిశోధన పత్రాన్ని ఏ విధంగా రాయాలి, డేటా ఏవిధంగా సమకూర్చుకోవాలనే విషయాలపై అవగాహన సాధించాలని, అప్పుడే ఒక పరిశోధన పత్రం సృజనాత్మకంగా, విశ్లేషణాత్మకంగా తయారు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ కెబివి సుబ్బయ్య, అధ్యాపకులు మాట్లాడారు. అనంతరం ప్రొఫెసర్ కెఎస్ గుప్తాను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

ప్రతిపక్ష నేతలు అభివృద్ధిని వీధుల్లోకి వచ్చి చూడాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రతిపక్షాల నాయకులు ఇళ్లలో కూర్చొని అభివృద్ధి జరగలేదని అబద్దాలు చెప్పడం, ప్రభుత్వంపై బురద చల్లడం సరైంది కాదని, వీదుల్లోకి వచ్చి చూస్తే అభివృద్ధి అంటే ఏమిటో తెలుస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి హితవు పలికారు. బుధవారం నంద్యాల పట్టణం ఓల్డ్ టౌన్‌లోని 5వ వార్డులో రూ. 60 లక్షలతో సిసి రోడ్డుకు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసాలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల ఓల్డ్ టౌన్ ప్రాంతం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించి కోట్ల రూపాయల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైన్లు, కల్వర్ట్‌లను నిర్మించినట్లు చెప్పారు. ప్రతిపక్ష నాయకులు ఓల్డ్ టౌన్ ప్రాంతానికి వచ్చి జరుగుతున్న అభివృద్ధిని చూసి విమర్శించాలని ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో గత ఆరు నెలల కాలంలోనే రూ. 2 కోట్ల 50 లక్షలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా వారికి అభివృద్ధి కనబడడం లేదంటే అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో నంద్యాల పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, వైసిపి కౌన్సిలర్లు ఆరిఫ్ నాయక్ సమద్, సాదిక్, మాజీ కౌన్సిలర్ చాంద్ బి, మహానందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కెఎస్ గుప్తా



స్ఫూర్తి అనాధ శరణాలయం నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న పాఠశాల హెచ్ఎం మేడ ప్రసాద్, ఉపాధ్యాయ బృందం

అనాధ శరణాలయానికి విద్యార్థులు విరాళం

ప్రజాశక్తి - రుద్రవరం

ఆళ్లగడ్డ పట్టణంలోని స్ఫూర్తి అనాధ శరణాలయానికి రుద్రవరంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ 4, 5 తరగతుల విద్యార్థులు రూ. 12 వేల నగదు విరాళంగా శరణాలయం నిర్వాహకులకు బుధవారం అందజేశారు. స్ఫూర్తి అనాధ శరణాలయం నిర్వాహకులు నాగేశ్వర రెడ్డికి చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు మేడా ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులతోకలిసి నగదును అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడ ప్రసాద్ మాట్లాడుతూ తమ విద్యార్థులు విద్యార్థి దశ నుంచి సామాజిక కార్యక్రమాలలో ముందుంటూ, తల్లిదండ్రుల సహకారంతో డబ్బులు సేకరించి అనాధలకు అందజేశారన్నారు. స్ఫూర్తి అనాధ శరణాలయం నిర్వాహకులు నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సేవాగుణం అభినందనీయమన్నారు. విద్యార్థి దశలోనే ఇలాంటి మానవతా దక్పథం కలిగినందుకు వారు రాబోయే రోజుల్లో ఉన్నత విద్యలో రాణించి సేవ గుణాలలో ముందుండి భవిష్యత్తులో మంచి పౌరులుగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహించిన చైతన్య స్కూల్ యజమాన్యంకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హుసేని, మహాలక్ష్మి, భాగ్యశ్రీ, సౌజన్య, కైరున్ సా బేగం, శశి భాయ్, షబానా, విజయలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధే ధ్యేయం

- మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని మున్సిపాలిటీలో ఉన్న 32 వార్డులను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. బుధవారం డోన్ పట్టణంలోని 20వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20వ వార్డుకు గడపగడపకు మన ప్రభుత్వం, స్పెషల్ గ్రాంట్స్, సిఎండిఎఫ్ నుంచి వచ్చిన 40 లక్షల రూపాయలతో సిసి డ్రైన్లు, రోడ్లు, కల్వర్టులు వేయిస్తున్నామని తెలియజేశారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో పట్టణంలోని 32 వార్డులకు రూ. 6 కోట్ల 40 లక్షలు స్పెషల్ గ్రాంట్స్ మంజూరు చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్రికె హరికిషన్, వార్డు కౌన్సిలర్‌లు షేక్ ఇంతియాజ్, సాదిక్, మల్లికార్జున రెడ్డి, డిఈ రసూల్, ఏఈ సురేష్, నంద్యాల జిల్లా బిసి అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్, పట్టణ యూత్ ప్రెసిడెంట్ రాజవర్ధన్, వైసిపి నాయకులు కాలేషా, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

సర్పంచుల నిధులు కాజేసిన ఘనత వైసిపిదే

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి- చాగలమర్రి

రాష్ట్రంలో గ్రామపంచాయతీల సర్పంచుల నిధులను సైతం కాజేసిన ఘనత ఒక వైసిపి ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. బుధవారం మండలంలోని మల్లె వేముల గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న మాజీ మంత్రికి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఒక్క అవకాశం అని చెప్పి అధికారంలోకి వచ్చాక రైతులు, మహిళలు, నిరుద్యోగులను గాలికి వదిలేసారన్నారు. గ్రామాల్లో సాగు, తాగు నీటి వనరులను విస్మరించారన్నారు. అభివృద్ధిని గాలికి వదిలేసి టిడిపి నాయకుల,కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడమే లక్ష్యంగా వైసిపి పనిచేస్తుందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే 18 సంవత్సరాలు నిండిన మహిళకు నెలకు రూ.1500, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలు టిడిపికి ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఆన్సర్ భాష, మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, టిడిపి నాయకులు కొలిమి హుసేన్‌వళి, ఈదుల ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శాస్త్రి, ప్రమోద్, నరసింహ, సురేష్, రాజా, శివరాం రెడ్డి, రజాక్, బషీర్, జెట్టి నాగరాజు, గఫార్, అజీం, ఇర్షాద్, రియాజ్, శేఖర్ రెడ్డి, టైలర్ ఖాదర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రంలో ప్రజలందరి భవిష్యతుకు గ్యారెంటీ అని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజలకు టిడిపి మినిమేనిఫెస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, మండల అధ్యక్షుడు ఉల్లి మధు, ఆర్ఎస్ గాజులపల్లె సర్పంచి అస్లాం భాష, గాజులపల్లె మహేశ్వర్ రెడ్డి, శశికళ కొండా రెడ్డి, జనార్ధన్ రెడ్డి, మౌళీశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఐదేళ్లలో ఉద్యోగాలు కల్పిస్తామని టిడిపి డోన్ నియోజకవర్గ ఇన్చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బూర్గుల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రామసుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే 38వ బూత్‌లో టిడిపి నాయకుడు పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జయకృష్ణ, కమలాకర్ పాల్గొన్నారు.



చాగలమర్రి : మాట్లాడుతున్న మాజీ మంత్రి అఖిలప్రియ



మహానంది : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి



ప్యాపిలి : మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

జాతీయస్థాయి యోగా పోటీలకు కెజిబివి విద్యార్థినిలు ఎంపిక

ప్రజాశక్తి - పాములపాడు

ఈ నెల 23 నుండి 26 వరకు అస్సాంలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు పాములపాడు కస్తూరిబా గాంధీ విద్యాలయం నుండి విద్యార్థినిలు సుమకీర్తి, తస్వీర్ ఫాతిమా బేగం, ఇంద్రాణిలు ఎంపికయినట్లు విద్యాలయం ప్రత్యేక అధికారి ఎం.రాజ్యలక్ష్మి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 16 నుండి 18 సంవత్సరాలలోపు విభాగంలో ఇంటర్ విద్యార్థిని ఇంద్రాణి, 14 నుండి 16 సంవత్సరాలలోపు విభాగంలో పదవ తరగతి విద్యార్థిని తస్వీర్ ఫాతిమా బేగం, 12 నుండి 14 సంవత్సరాలలోపు విభాగంలో 8వ తరగతి విద్యార్థిని సుమకీర్తిలు కర్నూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వీరిని ప్రత్యేక అధికారి రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయల బృందం అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ కళ్యాణి విద్యార్థులను అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ ఎపి నుండి వెళ్లే విద్యార్థులందరికీ టీం మేనేజర్‌గా ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

సచివాలయ వ్యవస్థతోనే గ్రామ స్వరాజ్యం : ఎంపిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రుజువు చేశారని బండి ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చిన్న దేవలాపురంలో సర్పంచి ఆవులపాటి మధుసూదన చౌదరి ఆధ్వర్యంలో జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు సమాన న్యాయం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైసిపి ప్రభుత్వాన్ని, వైసిపి ఎమ్మెల్యేలను ఆశీర్వదించాలని కోరారు. వైసిపి మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జెసిఎస్ మండల అధ్యక్షుడు ముడుమేల పుల్లారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో మళ్లీ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి పొదిలి వెంకటమ్మ, పరమటూరు సహకార సంఘం అధ్యక్షులు బూరం శివలింగం, మార్కెట్ అండ్ డైరెక్టర్ విక్రమ్ సింహా నాయక్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామాల్లో ఉన్న అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె. సుధాకర్ రెడ్డిలు తెలిపారు. మండలంలోని శివపురం గ్రామంలో సర్పంచు ఏర్రం చంద్రశేఖర్ యాదవ్, సూపరెండెంట్ సుబ్రమణ్యం అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాల సూచిక బోర్డును ప్రారంభించారు. అనంతరం వైసిపి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కో-ఆప్టెడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, ఎంపిటీసీ పెరుమాళ్ల శివన్న, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, మాజీ సర్పంచు క్రిష్ణ, నాయకులు మహబూబ్ బాషా, ఖలీల్ అహమ్మద్, గోవిందు, శ్రీరాములు, నారాయణరెడ్డి, చందమాల రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



బండిఆత్మకూరు : మాట్లాడుతున్న ఎంపిపి డి.చిన్న సంజీవరెడ్డి



కొత్తపల్లి : మాట్లాడుతున్న జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి



మధ్య ప్రదేశ్ మంత్రికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - శ్రీశైలం : కార్తీక మాసం సందర్భంగా శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రముఖులలో మధ్యప్రదేశ్ పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ శాఖ మంత్రి రాజేంద్ర శుక్లా, కర్ణాటక రాష్ట్రం పావుగడ ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేష్ తదితరులు ఉన్నారు. ముందుగా వీరు వేర్వేరుగా స్వామి అమ్మవార్లను దర్శించు కొనేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగానే ఆలయ అధికారులు, వేద పండితులు సంప్రదాయ పద్ధతిగా వేర్వేరుగా స్వాగతం పలికారు. అనంతరం ముందుగా స్వామి వారిని, ఆ తరువాత అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వారికి వేద పండితులు ఆశీర్వచనం పలికారు. జ్ఞాపికను, శేష వస్త్రాలను, ప్రసాదాలను అధికారులు అందజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - చాగలమర్రి: చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని నవ్యశ్రీ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.కోటయ్య తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినంద సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థిని నవ్యశ్రీ ఈ నెల 4, 5, 6వ తేదీలలో ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ అండర్-17 బాలికల విభాగంలో జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. జనవరి నెలలో రాజస్థాన్‌లో జరగబోయే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల సాఫ్ట్ బాల్ పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థిని, పిడి దాదాపీర్, పిఈటి భారతిలలకు హెచ్ఎం కోటయ్య, ఇన్చార్జి హెచ్ఎం మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, శివశంకర్, అంబటి రాజశేఖర్ రెడ్డి, నారాయణమూర్తి, మాబు బాషా, సుబ్రహ్మణ్యం, సురేశప్ప, సహదేవరెడ్డి, భాస్కర్ రెడ్డి, సూర్య బాబు, భవాని, సిబ్బంది బసవరాజు, శైలజ, మధురిమలు అభినందనలు తెలియజేశారు.

విఆర్ఒకు ఆర్థికసాయం

- మెరుగైన వైద్య చికిత్స అందించండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆళ్లగడ్డ మండలంలోని పేరాయపల్లె మెట్ట సమీపంలో గత శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన విఆర్ఓ ఆదిలక్ష్మి మెరుగైన వైద్యం కోసం రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్, జిల్లా కలెక్టర్ రూ. 5 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బుధవారం స్థానిక ఉదయానంద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విఆర్ఒను కలెక్టర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ తరపున రూ. 3 లక్షలు, జిల్లా కలెక్టర్ తరపున రూ. 2 లక్షలు చెక్కును జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య, ఇతర రెవెన్యూ సిబ్బంది అందజేశారు. విఆర్ఒకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆస్పత్రి సిబ్బందికి కలెక్టర్ సూచించారు. నంద్యాల ఆర్డిఓ శ్రీనివాసులు, కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది తదితరులు విఆర్వోను పరామర్శించారు.



విఆర్ఓ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న కలెక్టర్, జెసి



వినతిపత్రం అందజేస్తున్న నాయకురాళ్లు

డిసెంబర్ 8 నుండి సమ్మెలోకి..

- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - బేతంచెర్ల

అంగన్వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 8వ తేదీ నుండి సిఐటియు ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.షేభారాణి తెలిపారు. నిరవధిక సమ్మెకు సహకరించి న్యాయం చేయాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బేతంచెర్ల ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు షేభారాణి, సిఐటియు జిల్లా నాయకులు వై.ఎల్లయ్య మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్స్‌కి కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో సంబంధిత ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెట్టి స్పందించకపోవడం దారుణమన్నారు, ఎన్నికల కంటే ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అంగన్వాడీలకు సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తానని హామీనిచ్చి కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పెరిగిన నిత్యవసర సరుకులు ధరలు, విద్య, వైద్యం, రవాణా వంటి ఖర్చులు అధికమయ్యాయని, అందుకు జగనన్న ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం సమంజసం కాదన్నారు. మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకి, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికరమైన ఆహారం పంపిణీ, ఇటు సమాజానికి అటు ప్రభుత్వానికి ఎన్నో సేవలు అందిస్తున్న అంగన్వాడీల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపించడం సరికాదన్నారు. డిసెంబర్ 8వ తేదీ నుండి సిఐటియు ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయడానికి సహాయ సహకారాలు అందించాలని ఎంపిపి, చైర్మన్‌లను కోరారు. కార్యక్రమంలో యూనియన్ మండల నాయకులు రాజేశ్వరి, అనూష, అంగన్వాడీ టీచర్లు, మేరీ, శ్రీదేవి, లక్ష్మీదేవి, విజయలక్ష్మి, గుల్జార్ బి, సంతోషమ్మ, ఆదిలక్ష్మి, రాధమ్మ, మధురవాణి, రమణమ్మ, అరుణ, కళావతి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యువకుడు మృతి

- నివాళులు అర్పించిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - మహానంది : మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు(25) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. విషయం తెలిసిన జనసేన నాయకుడు మారెడ్డి రామయ్య గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామస్తులు చందు, మురళీ, శ్రీను, ఉసేని, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత బ్రహ్మ సంజీవరావు శర్మ జయంతి

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన గణితబ్రహ్మగా పేరొందిన లక్కోజు సంజీవరాయ శర్మ జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయుడు లక్ష్మీ కాంత రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఆరు వేల గణితావధానాలు చేసిన ఏకైక వ్యక్తి సంజీవరావు శర్మ అని కొనియాడారు. సంజీవరాయశర్మ 1907 నవంబర్ 22 న కడపజిల్లా ప్రొద్దుటూరు మండలం కల్లూరులో జన్మించారన్నారు.జన్మతః అంధుడని, అప్పట్లో బ్రెయిలీ లిపి కానీ, అంధుల్ని చేరదీసే వ్యవస్థ కానీ లేదన్నారు. శర్మ అక్క పాఠశాలలో చదివినవి ఇంటి దగ్గర గొంతెత్తి బిగ్గరగా మననం చేస్తే అవి విని గుర్తు పెట్టుకుని గణితంలో అపార విజ్ఞానం సాధించారన్నారు. తండ్రి మరణించడంతో తల్లి పెంచి పెద్దచేసిందని, కల్లూరులో రైతులకు ధాన్యం ధర, భూమి కొలతలు చెప్పేవారన్నారు. వారు ఆయనకి కొంత సొమ్ము చెల్లించే వారన్నారు. సంజీవరాయశర్మ తొలిసారి 1928 లో గణితావధానం నిర్వహించారని, అప్పటినుంచి 1995వరకు ఆయన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, బీహారు, ఢిల్లీ రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి ఆరువేల ప్రదర్శనలు ఇచ్చారన్నారు. అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు 1928 నవంబర్ 15న నంద్యాలలో జరిగినపుడు ప్రధాన ఆకర్షణ సంజీవరాయ శర్మ గణితావధానమేనని చెప్పారు. అప్పట్లో మద్రాసు గవర్నరు, భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వంటి జాతీయప్రముఖులు ఆయన మేధాశక్తికి ఆశ్చర్యచకితులయ్యారన్నారు. 4 వేల సంవత్సరాల వరకు సరిపోయే క్యాలండరు సైతం తయారుచేశారన్నారు. ఆయన ప్రతిభ రాయలసీమ నుంచి అంతర్జాతీయ వేదికల కెక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకట రమణ, సుబ్బారెడ్డి, రవిశేఖర్, వెంకట లక్ష్మీ, లక్ష్మయ్య, అనంత శ్రీనివాసులు, అల్లిపీరా, రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మధుసూదన్ రెడ్డి, విజయకుమార్, సుభాన్, శ్రీనివాసులు, జయసుబ్బరాయుడు, శివన్న, బాబు, ఆదినారాయణ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, భారతి,లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను, ప్రసాద్ రావు, ముని రాజు, మహేష్, అల్లిపీరా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణిత ఉపాధ్యాయుడు లక్ష్మీకాంత రెడ్డి

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- చాగలమర్రి

వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. బుధవారం చాగలమర్రి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని గొట్లూరు గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమం నిర్వహణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వివిధ రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉంటాయని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు అంజలి, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, సీతారాముడు, ఎంఎల్‌హెచ్‌పి భాగ్యనాయక్, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ

పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం : చైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూర్ : రాష్ట్రంలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడం కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అన్నారు. బుధవారం పట్టణంలోని (అర్బన్ కాలనీ -2) 9వ సచివాలయం పరిధిలో ఎపికికి జగనే ముఖ్యమంత్రి ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎస్ఎస్ సయ్యద్ మీర్, వార్డు కౌన్సిలర్లు కురుపాటి విజయ్ చౌదరి, మరుబోతుల విజయకుమార్, సుల్తాన్, రంగస్వామి, బోయ పార్వతమ్మ, శంకర్, మిట్ట కందాల మహబ్ తులా, రఫిక్, వరాల మాలిక్, ఎరుకలి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని 11వ సచివాలయం పరిధిలోని 6, 9, 11వ వార్డు కౌన్సిలర్లు చింతా లక్ష్మిదేవి, కొండ్రెడ్డి విజయమ్మ, దేశెట్టి సుమలత అధ్వర్యంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అబ్దుల్ రావుఫ్, చాంద్ బాషా, లాలు, హమీద్, నాయకులు రజినీ కుమార్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, చింతా సత్య నారాయణ, ఆర్ట్ శీను, కురువ శీను, శాలి బాషా, బ్రహ్మయ్య ఆచారి, రహిమాన్, రమణ, గోపి తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మండలంలోని కొలుములపల్లి గ్రామంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యమ్రం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ మురళీకృష్ణ, వైసిపి మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర్ రెడ్డి, నాయకులు గూని నాగరాజు, సర్పంచు చిన్న మద్దమ్మ, ఎంపిటిసి మరియమ్మ, వైస్ సర్పంచి మల్లారెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, సునీల్ రెడ్డి, ఎద్దులన్న, గ్రామ నాయకులు క్రిష్ణారెడ్డి, జయరామిరెడ్డి, బ్రహ్మేశ్వర రెడ్డి, కుమార్ రెడ్డి, నాగార్జున రెడ్డి, ఈశ్వర రెడ్డి, బుజ్జన్న, భాస్కర్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు. **చాగలమర్రి :** అన్ని రంగాల్లో రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే సాధ్యమని మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఎంపిపి వీరభద్రుడు, ఎంపిటిసి పత్తి నారాయణ, సర్పంచి సంజీవరాయుడులు తెలిపారు. బుధవారం మండలంలోని గొడిగనూరు గ్రామంలో ఎపికికి జగనే ముఖ్యమంత్రి ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి పతాకాన్ని ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల ద్వారా గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు అందించిన ఆర్థిక సహాయ జాబితాను వారు ఆవిష్కరించారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, వైసిపి నాయకులు తులసయ్య, రమేష్, సంజీవ రాయుడు, సూర్యనారాయణ, లక్ష్మయ్య, బాబు, సుదర్శనరెడ్డి, ఎంపీడీవో మహబూబ్ దౌలా, తహసిల్దార్ సుభద్రమ్మ, పంచాయితీ కార్యదర్శి దస్తగిరి, అధికారులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామం సచివాలయం-2లో ఎంపీటీసీ సురేష్, అయ్యన్న, గోవుల వెంకటశేషన్న ఆధ్వర్యంలో నిర్వహించిన వై ఎపి నీడ్స్ సిఎం జగన్ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు రవి యాదవ్ పాల్గొన్నారు. కొణిదెల గ్రామానికి చెందిన సంక్షేమ పథకాల బోర్డును స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వైసిపి జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పబ్బతి జ్యోతి, రవి, నాగటూరు సుధాకర్ రెడ్డి, జేసిఎస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి, నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, బైరెడ్డి శ్రీధర్ రెడ్డి, నాగటూరు రియాజ్, అమర్నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **వెలుగోడు :** వెలుగోడు పట్టణం సచివాలయం-3 పరిధిలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆదేశాల మేరకు ఎపికి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని వైసిపి సమన్వయ కర్త శిల్పా భువనేశ్వర రెడ్డి నిర్వహించారు. వైసిపి జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు.



ఆత్మకూరు : మాట్లాడుతున్న చైర్మన్ మారుఫ్ ఆసియా



వెలుగోడు : మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వర రెడ్డి



నందికొట్కూరు : మాట్లాడుతున్న చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి



బేతంచెర్ల : మాట్లాడుతున్న నాయకులు



పూలబొకే అందజేస్తున్న భారతి విద్యాసంస్థల చైర్మన్

వైసిపి సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్‌ను, ఎమ్మెల్యేను కలిసిన భారతి విద్యా సంస్థల చైర్మన్

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

వైసిపి సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల భార్గవ్ రెడ్డిని, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిని భారతి విద్యాసంస్థల చైర్మన్ వై.నాగేశ్వరరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం నంద్యాలలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో వారిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన చైర్మన్

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని గ్రంథాలయాన్ని కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ సమస్యలపై ఆరా తీశారు. గ్రంథాలయంలోని బాత్రూంలో నీరు సక్రమంగా బయటికి వెళ్లడం లేదని గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఎస్టిమేట్ వేసి పంపితే నిధులు మంజూరు చేస్తామని చైర్మన్ తెలిపారు.